20000816

# కాశ్మీర్ చర్చలు: ఎందుకు మొదలైనట్టు? ఎందుకు ఆగినట్టు?

**జమ్ము—కాశ్మీర్ రాష్ట్ర జనాభాలో మెజారిటీ కాశ్మీరీలే అయినప్పటికీ కాశ్మీరీల ప్రతినిధులే మొత్తం రాష్ట్ర ప్రతినిధులుకారు. కాశ్మీరీలలో అధిక భాగం భారత్ నుండి బయటికి పోవాలన్న లక్ష్యానికి అనుకూలమే అయినప్పటికీ పాకిస్తాన్ పట్ల వారందరి వైఖరీ ఒకటి కాదు. బహుశా పాకిస్తాన్‌లో కలవడం పట్ల అనుమానాలున్నవారే మెజారిటీ కావచ్చు.**

భారత ప్రభుత్వంతో హిజ్బుల్ ముజాహిదీన్ 'చర్చలు' ఎందుకు మొదలయినట్టు, ఎందుకు ఆగిపోయినట్టు?

మొన్న జరపాలని తలపెట్టినవి 'కాశ్మీర్ సమస్య' గురించి చర్చలుకావు. చర్చలు ఏ విధంగా ఏ రూపంలో జరగాలన్న విషయంలో అందరూ ఏకాభిప్రాయానికి వస్తే, అప్పుడు అసలు విషయం మీద చర్చలు మొదలయ్యేవి. ఇది సులభంగా జరిగేపని కాదని అందరికీ తెలుసు.

యాభై సంవత్సరాల మూర్ఖత్వం ఈ సమస్యను ఆవరించి ఉంది. రెండు వైపులా ఉంది. యాభై ఏళ్ళ నాటి కంటె ఎక్కువగా ఇప్పుడు మతతత్వ రాజకీయాల ప్రాబల్యం రెండు దేశాలలోనూ ఎక్కువకావడం మరొక సమస్య.

ఇంత క్లిష్టమైన పరిస్థితులలో చర్చలకు కూర్చునేటప్పుడు చాలా మెలకువగా వ్యవహరించడం అవసరం. చర్చలు ఏ పరిధిలో జరుగుతాయని మొదట అడిగినప్పుడు 'మానవత్వం పరిధి'లో అని మన ప్రధాని అన్నారు. ఆ వైఖరే అవసరం.

కానీ త్వరలోనే చర్చలు భారత రాజ్యాంగం పరిధిలోనే జరుగుతాయని మన పాలకులు అనసాగారు. భారత రాజ్యాంగంలో పలే 'కాశ్మీర్ పమస్యకు' పరిష్కారం ఉందా అన్నదే వివాదం కాబట్టి ఆ పరిధిలోనే చర్చలు జరుపుతామనడంలో అర్థం లేదు.

అటువైపు హిజ్బుల్ ముజాహిదీన్ కూడా చర్చలలో పాకిస్తాన్ కూడా భాగమవుతుందని, భారతదేశం వారం రోజులలోగా ఒప్పుకోకపోతే చర్చలకు ముగింపు పలుకుతామని హెచ్చరించడంలోనూ అర్థంలేదు. ఏదో ఒక రోజు పాకిస్తాన్ కూడా చర్చలలో భాగం కాక తప్పదు.

కాశ్మీరీలకు భారత్‌తోనూ పాకిస్తాన్‌తోనూ వచ్చిన సమస్య కాశ్మీర్. అయినప్పటికీ యాభై ఏళ్ళుగా భారత్ ఒప్పుకోని విషయాన్ని వారం రోజులలో ఒప్పేసుకోకపోతే చర్చల ప్రతిపాదన విరమించుకుంటామనడం చాలా తొందరపాటు చర్య.

నిజానికి చాలా నాటకీయంగా నడిచిన మొన్నటి రెండు వారాల ఘట్టంలో ఎవరి నిర్ణయాలూ స్వచ్ఛందం కావు. కాల్పుల విరమణ ప్రకటించి చర్చలకు కూర్చోవాలన్న నిర్ణయానికి హిజ్బుల్ ముజాహిదీన్ తానుగా రాలేదు హిజ్బుల్‌తో చర్చలకు కూర్చోవాలన్న నిర్ణయానికి భారత ప్రభుత్వం తానుగా రాలేదు. ఇరుపక్షాలూ అమెరికా ఒత్తిడివల్లనే ఆ నిర్ణయానికి వచ్చారు. అయిష్టంగా వచ్చారు. అంత కృత్రిమంగా మొదలయిన ప్రక్రియ కాబట్టే అంత అర్థాంతరంగా ముగిసింది.


నాగా మిలిటెంట్ గ్రూపులతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న చర్చలతో పోలిస్తే ఈ తేడా స్పష్టంగా అర్థం అవుతుంది. ఆ చర్చలు దాదాపు రెండేళ్ళుగా సాగుతున్నాయి. ఇరుపక్షాలూ అనవసరంగా పత్రికలకు ఎక్కకుండా, ఒకరికొకరు పవాళ్ళు విసురుకోకుండా చర్చలలో పాల్గొంటున్నారు.



కె.బాలగోపాల్

అవి 'రాజ్యాంగం పరిధి'లోపల జరగాలని భారత ప్రభుత్వం అనడంలేదు, అనజాలదు. తాము భారత రాజ్యంలో భాగం కాదన్నదే నాగా మిలిటెంట్ల అభిప్రాయం —నాగా ప్రజలలో చాలా మంది అభిప్రాయం —కాబట్టే 'నాగా సమస్య' ఉత్పన్నమయింది. కాబట్టి అది భారత రాజ్యాంగం పరిధి లోపలే పరిష్కారం అయితీరాలనడంలో అర్థం లేదు. ఒక మత గ్రంథమేదీ లేని ఆధునిక లౌకిక రాజ్యాలకు రాజ్యాంగం పవిత్రగ్రంథం కాకూడదు. ఏ పమాజానికయినా ఒక సంవిధానం అవసరం.

అది నిలకడయిన జీవితానికి అవసర



మైన భద్రతనిస్తుంది. మార్పుకు నిలకడయిన అవకాశాలిస్తుంది. ఒక దిశనిస్తుంది. అయితే దాని మూలాన్నే ప్రశ్నించే ఉద్యమాలు గానీ, సంక్షోభాలుగానీ ముందుకొచ్చినప్పుడు అవి కూడా 'రాజ్యాంగం పరిధి'లోనే పరిష్కారం కావాలనడంలో అర్థం లేదు. కాగలిగితే మంచిదే. అప్పుడు ఆ రాజ్యాంగానికి విశాల స్వభావం ఉందని రుజువవుతుంది.

ఇదంతా అట్లాగుంచి, నాగాలాండ్ విషయానికొచ్చేసరికి, చర్చలు అవసరమని ఇరు పక్షాలూ —వారి వారి కారణాల వల్ల నమ్ముతున్నారు కాబట్టే, ఏ భేషజాలకూ పోకుండా మాట్లాడుకుంటున్నారు. 'భారత రాజ్యాంగం పరిధిలోనే' జరగాలని ప్రభుత్వం అనడంలేదు. నాగా పోరాటకారులూ ఏ షరతులూ పెట్టడంలేదు. నాగా పోరాటకారుల మాటకొస్తే, వారి పోరాటానికి బయటి సహాయం లేకపోవడం వల్ల అది చాలా అసమానపోరాటంగా ఉంది.

50 ఏళ్ళుగా వాళ్ళు అసాధారణమైన పట్టుదలతో పోరాడుతున్నారు. స్థానిక ప్రజలలో వారి లక్ష్యానికి చాలా మద్దతు ఉంది. అయితే ఒకపెద్ద సైన్యాన్ని ఎల్లకాలం ఎదుర్కొనడానికది సరిపోదు.

తమతో ప్రమేయం లేని చారిత్రక కారణాలవల్ల కొందరు ఇండియాలో, కొందరు బర్మాలో చిక్కుకున్న నాగా తెగల ('నాగా' అనే తెగ ఏదీలేదు. అది భిన్నతెగల సామాన్య 'ఐడెంటిటీ') స్వాతంత్ర ఆకాంక్ష ఎప్పటికైనా సిద్ధించాలంటే రాజకీయ మార్గాలు వెతుక్కోక తప్పదనీ, తుపాకీతోనే ఎప్పటికీ పోరాడుతూ ఉండలేమనీ వారు భావించడం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు.

కాగా, పాకిస్తాన్‌ను కూడా చర్చలలో భాగం చేయడానికి భారత్ ఒప్పుకుంటేనే తిరిగి చర్చలకొస్తామని హిజ్బుల్ ముజాహిదీన్ ప్రకటించింది. పాకిస్తాన్‌ను చర్చలలో భాగస్వామి చేయడం అటుంచి, మిలిటెంట్లు పాకిస్తాన్‌తో తెగతెంపులు చేసుకుంటేనే వారితోనయినా మాటలు జరుగుతాయని భారత ప్రధాని ప్రకటించారు.

'చర్చించేది లేదు' అని ఇద్దరూ ప్రకటించేస్తే పరిపోయేదానికి ఈ పవాళ్ళు విసురుకోవడమెందుకు? అమెరికాను మెప్పించడానికి 'మేము చర్చలకు సిద్ధమేగానీ ఎదుటివారే వాటిని అసాధ్యం చేస్తున్నారు' అని క్లింటన్‌కు చెప్పుకోవడమే దీని ఉద్దేశమా? చర్చలు క్లింటన్ కోసం జరుపుకుంటామా, మన కోసం జరుపుకుంటామా?

పాకిస్తాన్‌ను చర్చలలో మూడవ పక్షం చేయకతప్పదుగ్గానీ తొలి దశలోనే భారత్ దానికి ఒప్పుకోవడానికి స్వయంకృతమైన అవరోధాలున్నాయి. దేశభక్తి పేరు మీద ఈ దేశంలో చలామణి అవుతున్న అవాస్తవికమైన అభిప్రాయాలకు ప్రధాన మూలం ప్రస్తుత పాలకులే కాబట్టి వారు ఆ పని నెమ్మది మీదనే చేయగలరని హిజ్బుల్ ముజాహిదీన్ గ్రహించాలి.

ఇప్పుడు తలపెట్టిన చర్చలు అపలు చర్చల 'మోడాలిటీస్'కు పంబంధించినవే కాబట్టి, ఆ చర్చాచట్రాన్ని, నియమాలను ముందు షరతుల ద్వారా నిర్ణయించే ప్రయత్నం చేయడం తెలివితక్కువ తనం.

కాగా 'త్రైపాక్షిక' చర్చలకు హిజ్బుల్ ముజాహిదీన్ ఇస్తున్న నిర్వచనం గురించి కూడా ఆలోచించాలి. 'ఇండియా, పాకిస్తాన్, కాశ్మీర్ ప్రతినిధులు' అంటున్నారు. కాశ్మీర్ ప్రతినిధులు అంటే ఎవరు? అయిదారేళ్ళుగా కాశ్మీర్‌లో అందరూ త్రైపాక్షిక చర్చలే పరిష్కారానికి మార్గం అంటున్నారు.

కానీ 'కాశ్మీర్ ప్రతినిధులు' ఎవరు అని అడిగినప్పుడు జమ్మూ కాశ్మీర్ భవితవ్యాన్ని గురించి ఆ రాష్ట్రంలో భిన్న అభిప్రాయాలున్నాయనీ అన్ని గొంతులూ కలిసినప్పుడే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించగలవనీ అందరూ ఒప్పుకుంటున్నారు. వాటిలో హిజ్బుల్ ముజాహిదీన్ ఒకటి అనడంలో సందేహమక్కరలేదు. హిజ్బుల్ ముజాహిదీన్‌కు కాశ్మీర్ లోయలో చాలా ప్రజాదరణ, గౌరవం ఉన్నమాట సత్యమే.

అయినప్పటికీ ఆ సంస్థ కాశ్మీర్ ప్రతినిధి కాదు, మొత్తం జమ్ము—కాశ్మీర్ ప్రతినిధి అసలే కాదు. కాశ్మీర్ లోయలో కూడా, ఆ లోయ పాకిస్తాన్‌లో కలవాలని కోరుకునే హిజ్బుల్ ముజాహిదీన్ కన్నా, ఆ లోయలోని కాశ్మీరీలు, పాకిస్తాన్‌లోని కాశ్మీరీలు కలిసి ఒక స్వతంత్ర, సెక్యులర్, ప్రజాస్వామ్య రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని నమ్మే జమ్ము—కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఆలోచనా రీతికే ఎక్కువ ఆదరణ ఉందన్న బలమైన అభిప్రాయం ఉంది.

జమ్ము—కాశ్మీర్ రాష్ట్ర జనాభాలో మెజారిటీ కాశ్మీరీలే అయినప్పటికీ కాశ్మీరీల ప్రతినిధులే మొత్తం రాష్ట్ర ప్రతినిధులుకారు.

కాశ్మీరీలలో అధిక భాగం భారత్ నుండి బయటికి పోవాలన్న లక్ష్యానికి అనుకూలమే అయినప్పటికీ పాకిస్తాన్ పట్ల వారందరి వైఖరీ ఒకటి కాదు. బహుశా పాకిస్తాన్‌లో కలవడం పట్ల అనుమానాలున్నవారే మెజారిటీ కావచ్చు.

కాబట్టి 'త్రైపాక్షిక' చర్చలలో జమ్ము—కాశ్మీర్ ప్రజల ప్రతినిధులను నిర్ణయించడమంటే ఈ భిన్న అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించే ఒప్పందాన్ని నిర్ణయించడం. ఇది కేవలం విధానపరమైన అవసరం కాదు. 'కాశ్మీర్ సమస్య' ప్రాథమికంగా కాశ్మీరీల పమస్య.